

శుభ్రం చేసి.. ముగ్గులు వేసి

స్వచ్ఛతలో ఇక్షోర కంపెనీ స్వచ్ఛతకు మారుపేరుగా పనిచేస్తుంది. కార్వాన్ డివిజన్ పరిధిలోని లంగర్‌హౌస్‌లో ప్రధాని రహదారి పక్కనే డంపింగ్ యార్డ్‌లా మారిన పరిసరాలను జీహెచ్‌ఎంసీ, ఇక్షోర కంపెనీ కార్మికులు పూర్తిగా శుభ్రపరిచారు. మురికికూపంగా ఉన్న ఆ ప్రాంతాన్ని చెత్తాచెదారం తొలగించారు. కార్వాన్ డివిజన్ ఇక్షోర కంపెనీ మేనేజర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్మికులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

అధ్వానంగా బల్దియా వార్డు కార్యాలయం



గోల్కొండ బల్దియా కార్యాలయం ఆఫీసు గది తలుపు



గోల్కొండ వార్డు కార్యాలయం రెండవ గేటు ముందు వ్యర్థాలు



వార్డు కార్యాలయం కిటికీ దుస్థితి

గోల్కొండ: గోల్కొండలోని బల్దియా వార్డు కార్యాలయం నిర్వహణ అధ్వానంగా తయారైంది. వివిధ పనుల కోసం వచ్చే వారు కార్యాలయ భవనాన్ని చూసి ఇదేమి నిర్వహణ అని ఆశ్చర్యపోతున్నారు. పురాతన భవనంలో కొనసాగుతున్న ఈ కార్యాలయ భవనానికి తూతూ మంత్రంగా మరమ్మత్తులు చేస్తున్నారే తప్ప కొత్త భవన నిర్మాణాల సంగతి పట్టించుకోవడం లేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్యాలయాలకు కొత్త రూపు ఇస్తున్నామంటూ భారీ ప్రకటనలు చేశారు. అయితే గోల్కొండ కార్యాలయానికి కేవలం కార్యాలయ బోర్డు మాత్రమే ఉంచి చేతులు దులుపుకుంది. గోల్కొండ కోట ప్రధాన ద్వారానికి ఎదురుగా ఉన్న ఈ భవనం బల్దియాకు చెందిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది ఉంటున్నారు. వార్డు కార్యాలయం మొదటి గేటు ఎప్పుడూ తెరుచుకోనే ఉంటుంది. రెండవ గేటు పూర్తిగా అధ్వానంగా తయారైంది. దీని ముందు గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థాలను డంపింగ్ చేశారు. ఇప్పటి వరకు ఈ వ్యర్థాలను పారిశుద్ధ్య విభాగం వారు తొలగించకుండా వదిలేశారు. కార్యాలయ భవనానికి ఉన్న తలుపు కింది భాగం పూర్తిగా దెబ్బతినింది. దానికి ఆనుకొని ఉన్న కిటికీకి ఉన్న జాలీ పూర్తిగా చిరిగిపోయింది. కిటికీ కింది భాగం వద్ద పాన్, గుట్కాలు తిన్న వారు ఉమ్ము వేసిన కారణంగా ఆ ప్రాంతం ఎర్రగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. బల్దియా అధికారులు ఇక్కడికి వస్తున్నా కూడా భవన మరమ్మత్తుల విషయమై ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఈసారి హైదరాబాద్ సీటు కాంగ్రెస్‌దే



కాంగ్రెస్ హైదరాబాద్ అభ్యర్థి మహ్మద్ వలీఉల్లా సమీర్‌తో కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: హైదరాబాద్ పార్లమెంట్ స్థానం ఈసారి కాంగ్రెస్ పార్టీదేనని కాంగ్రెస్ హైదరాబాద్ అభ్యర్థి మహ్మద్ వలీ ఉల్లా సమీర్ అన్నారు. గురువారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు శాలువా వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల మనిషి అని ఆయన తీసుకుంటున్న నిర్ణయాల వల్ల పేద, బడుగు వర్గాలతో పాటు ప్రతి ఒక్కరికీ నచ్చుతున్నాయని అన్నారు. ఎం.రఘుపాల్‌రెడ్డి, ఏ.చంద్రశేఖర్, వినోద్‌సింగ్, వెంకటకృష్ణ, హబీబ్, తదితరులున్నారు.

బాధిత మహిళకు బ్యాగ్ అందజేత



బాధిత మహిళకు నగలు, నగదును అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి

సంతోష్‌నగర్: ఆటోలో బంగారు నగలు, నగదుతో కూడిన బ్యాగ్‌ను పోగొట్టుకున్న మహిళకు కంచన్‌బాగ్ పోలీసులు గుర్తించి గురువారం బాధిత మహిళకు అందజేశారు. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి తెలిపిన మేరకు.. హఫీజ్‌బాబానగర్ ప్రాంతానికి చెందిన జెబా సుల్తానా ఈ నెల 24న సాయంత్రం బండ్లగూడ ప్రాంతంలో తన బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయింది. బ్యాగ్‌లో 90 గ్రాముల బంగారు నగలు, రూ.20 వేలు ఉండటంతో స్థానికంగా వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో కంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సీసీ కెమెరా, ఇతర ఆధారాలతో ఆటోను గుర్తించి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకొని గురువారం బాధిత మహిళకు ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి అందజేశారు. దీంతో బాధిత మహిళ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

సుల్తాన్‌బజార్: ఇంటర్ ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురైన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ సంఘటన సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్ తెలిపిన మేరకు.. రాజమహాల్లా శంషాబాద్‌కు చెందిన సోమరాజు పాండు కుమారుడు దుయక్‌కిరణ్(17) చిక్కడపల్లిలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం వచ్చిన ఇంటర్ ఫలితాలలో ఉదయ్‌కిరణ్ పాస్‌కాలేదు. అధైర్య పడవద్దని తల్లిదండ్రులు ధైర్యం చెప్పారు. ఇల్లును మార్చుతుండడంతో తన తల్లిని కర్మన్‌ఘాట్‌లో వదిలి వచ్చాడు. లోపలికి వెళ్లిన ఉదయ్‌కిరణ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

నయవంచన పేరుతో ఫ్లెక్సీల ఏర్పాటు

గన్‌ఫౌండ్రీ: పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న తరుణంలో కేంద్రప్రభుత్వ తీరును ఎండగడుతూ.... నయవంచన పేరుతో కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు విరుద్ధంగా సాగిందని ఎత్తిచూపుతూ పదేళ్ల మోసం - వందేళ్ల విధ్వంసం అంటూ గురువారం గాంధీభవన్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాలలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. 2014 ఎన్నికల సమయంలో సంవత్సరానికి రెండు కోట్ల చొప్పున ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చారని మరి పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా అంటూ ఫ్లెక్సీలో ప్రశ్నించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, అవినీతిని రూపుమపడం, నల్లధనాన్ని వెనక్కి తీసుకువచ్చి ఒకొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని ఇచ్చిన హామీలు ఎక్కడ అంటూ నిలదేశారు.

మానవ విలువలను గౌరవించాలి



హ్యూమన్ వాల్యూస్ డే వాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థినులు

గోల్కొండ: మానవ విలువల గురించి తెలుసుకోవడమే కాకుండా ఇతరులు కూడా వాటి విలువ తెలపాల్సిన అవసరం ఉందని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ జి.రాఘవరెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో హ్యూమన్ వాల్యూస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులు వాకథాన్‌ను నిర్వహించారు. వాకథాన్‌ను ప్రారంభించి ఆయన విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ మానవ విలువలను గౌరవించడంతో పాటు ప్రతి ఒక్కరూ వాటిని తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, డాక్టర్ ఎం.మాధవీలత, డాక్టర్ బి.రాజేశ్వరి పాల్గొన్నారు.

మూడు ట్యాంకర్లు... ఆరు ట్రిప్పులు

- జోరుగా నీటి వ్యాపారం
- కాలనీలు, అపార్ట్‌మెంట్‌లలో ట్యాంకర్లకు ఫుల్ డిమాండ్



గుడిమల్కాపూర్‌లో ఓ అపార్ట్‌మెంట్ వద్ద నీటిని సరఫరా చేస్తున్న ట్యాంకర్

గోల్కొండ: రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీనికి తోడు భూగర్భ జలాలు రోజు రోజుకూ అడుగంటిపోతున్నాయి. బస్తీలు, కాలనీలలో నీటి ఎద్దడి నెలకొంది. అయితే ఏదో విధంగా బస్తీలు, కాలనీల వాసులు తిప్పలు పడుతూ నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. అపార్ట్‌మెంట్‌ల వాసులు మాత్రం చుక్క నీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. గుడిమల్కాపూర్, మెహిదీపట్నం, కార్వాన్, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో గత కొంత కాలం వెలిసిన బహుళ అంతస్తులలో నివసించే వారు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు నీటి ట్యాంకర్లను ఆశ్రయించే వారి నుంచి డిమాండ్ పెరగడంతో ఒక్క ట్యాంకర్ కోసం రోజుల తరబడి ఎదురు చూస్తున్నారు. నగర శివారు ప్రాంతాల నుంచి ప్రైవేటు నీటి ట్యాంకర్ల వారు తెస్తున్న నీరు అపార్ట్‌మెంట్ వాసులకు ఆధారంగా మారింది. మణికొండ, గోల్కొండలోని వన్‌మోర్ నగర్‌తో పాటు రాజేంద్రనగర్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేటు నీటి ట్యాంకర్ల వారు నీటిని తెస్తున్నారు. మరికొందరు ప్రత్యేకంగా తమ ఇళ్లు, ఖాళీ స్థలాల్లో బోర్లు వేసుకున్నారు. ఈ బోర్ల నీటిని ట్యాంకర్లలో నింపి నీటి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ నీరు అపరిశుభ్రంగా ఉన్నా కూడా గత్యంతరం లేక ప్రజలు దీనినే కొంటున్నారు. నీటి లభ్యత తగ్గుతున్న కొద్దీ నీటి ట్యాంకర్ల నిర్వాహకులు రేట్లను ఇబ్బడిముబ్బడిగా పెంచేశారు. ఐదు వేలు, పది వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకర్లలో కనీసం 10-15 రోజుల ముందు బుక్ చేసుకోవాల్సి వస్తుంది. ఐదు వేల ట్యాంకర్ల నీటికి మూడు నుంచి ముడున్నర వేలు, పది వేల సామర్థ్యం గల ట్యాంకర్‌కు 8-10 వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. అయితే 5 వేల సామర్థ్యం గల నీటి ట్యాంకర్‌లో కేవలం నాలుగు వేల సామర్థ్యం మాత్రమే ఉంటుందని, పది వేల లీటర్ల సామర్థ్యంలో తొమ్మిదిన్నర వేల లీటర్లు మాత్రమే ఉంటోందని వాపోతున్నారు. ఏదేమైనా ప్రైవేటు నీటి వ్యాపారం మూడు ట్యాంకర్లు, ఆరు ట్రిప్పులుగా కొనసాగుతుంది.

దక్షిణ మండలం డీసీపీగా స్నేహ మెహ్రా



చార్మినార్: హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని దక్షిణ మండలం డీసీపీగా ఐపీఎస్ 2018 బ్యాచ్‌కు చెందిన స్నేహ మెహ్రాను ఎన్నికల కమిషన్ నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ డీసీపీగా పని చేసిన పోతురాజు సాయి చైతన్యను ఎన్నికల కమిషన్ బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో వెంటనే బాధ్యతలు చేపట్టే విధంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో శుక్రవారం ఉదయం ఆమె పురానీహవేలీలోని పాత పోలీసు కమిషనర్ కార్యాలయంలోని డీసీపీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోండి

బహదూర్‌పురా: పురానాపూల్ పార్థివాడ కమ్యూనిటీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గుర్తుతెలియని వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ పురానాపూల్‌కు చెందిన రామ్‌కుమార్ కామాటిపుర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపిన మేరకు.. పురానాపూల్ పార్థివాడలో నివాసం ఉంటున్నవారు మజ్లిస్ పార్టీకి మద్దతు తెలపడంతో గుర్తుతెలియని వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ స్థానికుడు రామ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బీజేపీ ఎన్నికల కో ఆర్డినేటర్‌గా ప్రేమ్‌సింగ్

అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ ఎన్నికల కో ఆర్డినేటర్‌గా గోషామహాల్ మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్‌ను నియమిస్తూ రాష్ట్ర బీజేపీ అధిష్టానం ఆదేశాలు జారీచేసింది. ఈ సందర్భంగా ప్రేమ్‌సింగ్ రాథోడ్ మాట్లాడుతూ..... నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు బూత్‌స్థాయి కార్యకర్తల నుంచి అందరిని సమన్వయ పరిచి బీజేపీ అభ్యర్థి మాధవీలతను గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాంపల్లి: రైలు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన హైదరాబాదు జీఆర్పీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని వ్యక్తి గురువారం లింగంపల్లి రైల్వే స్టేషన్ దగ్గర రైలు పట్టాలు దాటుతుండగా ఓ గూడ్స్ రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు.

పోలీసులపై దురుసు ప్రవర్తన.. వ్యక్తికి జైలు

సంతోష్‌నగర్: పోలీసుల విధులకు ఆటంకం కల్పించిన కేసులో ఓ వ్యక్తికి నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చాచ్చింది. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి, ఎస్సై జి.లింగరాజు తెలిపిన మేరకు.. సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఎస్: వెంకటప్ప ఈ నెల 13వ తేదీన డీఎంఆర్‌ఎస్ రోడ్డు సాయిబాబా దేవాలయం సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మీర్‌పేట్ అల్మాస్‌గూడ ప్రాంతానికి చెందిన ప్రేమ్ సింగ్ బాటి (24) ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించకుండా వచ్చాడు. చలాన్ విధించేందుకు వివరాలు అడగగా గొడవ పడుతూ పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో పోలీసులు కంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రేమ్‌సింగ్ బాటిని అరెస్ట్ చేసి ఈ పెట్టి కేసు నమోదు చేసుకొని గురువారం నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పరచగా... పూర్వాపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ ఎస్.సత్యనారాయణ ప్రేమ్‌సింగ్ బాటికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

ప్రజా సేవ చేయడమే మజ్లిస్ లక్ష్యం



గోల్కొండలో మజ్లిస్ ఎన్నికల ప్రచారంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి మాటల కంటే చేతలే ప్రధానమని ఆ పార్టీ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీ, గోల్కొండ డివిజన్‌లలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసికి ఓటు వేయాలని కోరుతూ ప్రచారం అంతేకాకుండా మజ్లిస్‌చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య ఎక్కడ ఉన్నా తాను అక్కడికి వెళ్లి పరిశీలిస్తానని అన్నారు. వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి వాటిని తెచ్చి పరిష్కరిస్తున్నానని అన్నారు. మహిళలు, నిరుద్యోగ యువతీ యువకులకు తమ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటూ వస్తోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు అజీజ్‌ఖాన్‌పటాన్, ఆరూన్‌ఫరాన్, ఎం.ఏ.ముజీబ్ తదితరులున్నారు.

మోదీ చేసిన అభివృద్ధిని వివరించండి



మాట్లాడుతున్న ఎస్సీమోర్చ రాష్ట్ర నేత భీశ్వ ఓంప్రకాష్ తదితరులు

అబిడ్స్ / సుల్తాన్‌బజార్ : ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, ప్రగతిని, సంక్షేమాన్ని గడప గడపకు చాటి బీజేపీ గెలుపుకు ప్రతి కార్యకర్తా కృషి చేయాలని హైదరాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత పేర్కొన్నారు. గురువారం గోషామహల్ నియోజకవర్గంలోని రామ్‌కోఠి మహారాష్ట్రమండలిలో జరిగిన ఎస్సీ మోర్చ కార్యకర్తల సమ్మేళనంలో ఆమె ప్రసంగించారు. దళితులకు అండగా బీజేపీ ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షురాలు కాంచల కృష్ణ, పార్లమెంటు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్సీమోర్చ రాష్ట్ర నేత భీశ్వ ఓంప్రకాష్ పాల్గొన్నారు.

నాటక రంగాన్ని కాపాడుకుందాం

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో పరుచూరి రఘుబాబు స్మారక 34వ జాతీయస్థాయి నాటక, నాటికల పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 34 సంవత్సరాలుగా జాతీయస్థాయిలో నాటక పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సినీ నటుడు పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. ఈ మూడు రోజుల పాటు ఈ నాటకోత్సవాలు జరుగుతాయని ఈ నెల 27వ తేదీన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ అంశాలపై ప్రదర్శించిన పలు నాటకాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సినీ నటులు పరుచూరి వెంకటేశ్వర రావు, శివపార్వతి, రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ, రంగస్థల దర్శకుడు ఆచార్య డీఎస్ఎన్ మూర్తి, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురి నిందితులకు జైలు

చార్మినార్: చార్మినార్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆరుగురు నిందితులకు నాంపల్లిలోని 1వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ సాధారణ జైలు శిక్షతో పాటు రూ.550 జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్ తెలిపారు. మహ్మద్ ఫైజల్ ఖాన్(21), మహ్మద్ డానిష్(19)అనే యువకులు 7 ఈ-పెట్టీ కేసులలో నిందితులుగా ఉన్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ దేవీరెడ్డి అభిరాంరెడ్డి 25 రోజల పాటు జైలు శిక్షతో పాటు రూ.550 జరిమానా విధించారు. అలాగే మహ్మద్ రెహ్మాన్ ఖాన్(24),షానవాజ్ షరీఫ్(38),అల్మాస్ షరీఫ్(35),మహ్మద్ ఇంతియాజ్(32) అనే నిందితులకు 5 రోజుల పాటు సాధారణ జైలు శిక్షతో పాటు రూ.550 జరిమాన విధించారు.

ఎందుకు ఎంబీటీ విరమణ?

- ప్రత్యేక రాజకీయ పరిస్థితుల కారణంగా పోటీ నుంచి తప్పుకున్న ఎంబీటీ
- ప్రచారంలో దూసుకుపోతున్న బీజేపీ అభ్యర్థి మాధవీలత
- ప్రస్తుతం హైదరాబాద్‌లో మజ్లిస్ వర్సెస్ బీజేపీ
- ఇంకా ప్రచారాన్ని మొదలు పెట్టని బీఆర్‌ఎస్, కాంగ్రెస్

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఇప్పటికే బీజేపీ, మజ్లిస్ పార్టీలు ఎన్నికల ప్రచారంలో దూసుకు పోతున్నాయి. హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో ఈ రెండు పార్టీలే పోటీలో ఉన్నాయా? అన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒక దశలో మజ్లిస్ పార్టీకి హైదరాబాద్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోందని..బోగస్ ఓట్ల పేరుతో కొన్ని ఓట్లు తొలగిపోతే సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీకి ఈ ఎన్నికల్లో ఎదురీత తప్పదని పరిశీలకులు భావించారు. దీనికి తోడు గత శాసన సభ ఎన్నికల్లో యాకుత్‌పురా శాసన సభ నియోజక వర్గం నుంచి పోటీ చేసిన మజ్లిస్ బచావ్ తహ్రీక్ (ఎంబీటీ) పార్టీ అభ్యర్థి అంజదుల్లా ఖాన్ నెక్ టూ నెక్ ఫైట్ ఇచ్చారు. దీంతో ఇప్పటికే బీజేపీతో గట్టి పోటీని ఎదుర్కొంటున్న మజ్లిస్ పార్టీకి ఎంబీటీ కూడా ఈ ఎన్నికల బరిలోకి దిగితే పరిస్థితులు అనుకూలంగా ఉండకపోవచ్చని భావించారు. హైదరాబాద్‌లో రాజకీయ పరిస్థితులు మారుతున్న విషయం ముస్లిం మత పెద్దల జోక్యం వరకు వెళ్లింది. వెంటనే రంగంలోకి దిగిన ముస్లిం మత పెద్దలు కార్యాచరణకు శ్రీకారం చుట్టి సక్సెస్ అయినట్లు సమాచారం. ఎన్నికల్లో ఎంబీటీ పోటీ చేయకుండా రాయబారాలు కొనసాగించి ఆశించిన ఫలితం సాధించారని తెలుస్తోంది. ఎంబీటీ పోటీ చేయడం లేదని ప్రకటించడంతో హైదరాబాద్‌లో మజ్లిస్ పార్టీకి తిరుగు లేదని స్పష్టం అయ్యిందని మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు.

పోటీలో నలుగురు ప్రధాన పార్టీల అభ్యర్థులున్నా..

గురువారం సాయంత్రం నామినేషన్ల పర్వం పూర్తి కావడంతో హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో పాటు బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీ లత, బీఆర్‌ఎస్ నుంచి గడ్డం శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నుంచి సమీర్ వలి ఉల్లా తదితర నాలుగు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. మజ్లిస్ పార్టీ, బీజేపీ అభ్యర్థులు ఇప్పటికే తమ ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహిస్తుండగా..బీఆర్‌ఎస్ అభ్యర్థి పార్టీ అధిష్టానం నుంచి పేరు అధికారికంగా ఖరారు అయినప్పటికీ ఇంకా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించ లేదు. ఇక కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించింది. అభ్యర్థి ఎవరో తెలియకపోవడంతో ఎన్నికల ప్రచారం మాటే లేదు. ఈయన గురువారం సాయంత్రం మలక్‌పేట్ నియోజక వర్గంలోని చాదర్‌ఘాట్‌లో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇక ఎంబీటీ పోటీ చేయడం లేదని ప్రకటించింది.

ఎంబీటీ పోటీలో లేకపోవడంతో మజ్లిస్ పార్టీ విజయం ఈజీ అయ్యిందా..

ఎంబీటీ పోటీలో లేకపోవడంతో సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ విజయం ఈజీ అయ్యిందా...అంటే..అవునని అంటున్నారు రాజకీయ పరిశీలకులు. గత శాసన సభ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీకి దీటుగా యాకుత్‌పురా శాసన సభ నియోజక వర్గం నుంచి కేవలం 878 ఓట్ల తేడాతో పరాజయం పొందిన ఎంబీటీ అభ్యర్థి అంజదుల్లాఖాన్ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి పోటీ చేయనున్నట్లు ఎంబీటీ నాయకులే బహిరంగంగా చెప్పారు. ఈ మేరకు కసరత్తు కూడా జరిగింది. అయితే సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీకి దీటుగా హైదరాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా మాదవీ లత ఎన్నికల బరిలోకి దిగడంతో మజ్లిస్ పార్టీకి దిక్కుతోచని పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో ఎంబీటీ పోటీ చేస్తే..ముస్లిం ఓట్లు చీలి బీజేపీకి మేలు జరిగే పరిస్థితులుండడంతో కొంత మంది మత పెద్దలు ఎంబీటీని ఈ ఎన్నికల్లో పోటీ చేయవద్దని వత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. దీంతో మత పెద్దల మాటలను పక్కన పెట్టని ఎంబీటీ పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు బహిరంగంగా కార్యకర్తలు, నాయకుల ముందు చెప్పేసి చేతులెత్తేసింది. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ నుంచి విరమించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులే కారణమంటున్నప్పటికీ..అసలు రహస్యం మత పెద్దల జోక్యంతో వచ్చిన వత్తిడి కారణమని అంటున్నారు. పోటీలో ఉంటే..ఓట్లు చీలి బీజేపీకి మేలు జరుగుతుందనే విషయాన్ని మత పెద్దలు ఎంబీటీకి వివరించినట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్లు

యాకుత్‌పురా: పాతబస్తీలో తమ పార్టీ చేసిన అభివృద్ధితో ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం విజయం సాధిస్తామని మజ్లిస్ పార్టీ యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన హైదరాబాద్ మజ్లిస్ పార్టీ ఎంపీ అభ్యర్థికి మద్దతుగా తలాబ్‌చంచలం డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తలాబ్‌కట్టా షాజహాన్ ఫంక్షన్ హాల్ నుంచి పాదయాత్ర చేస్తూ ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. కార్పొరేటర్లు డాక్టర్ సమీనాబేగం, నస్రీన్ సుల్తానా పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణ వల్లే ఉత్తమ ఫలితాలు



గోల్కొండ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మాధవిని సన్మానిస్తున్న బి.సాయిబాబాచారి

గోల్కొండ: నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ సంవత్సరం తాము గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించామని గోల్కొండలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి.మాధవి అన్నారు. కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం ఆధ్వర్యంలో గురువారం కళాశాల ప్రిన్సిపల్‌ను, కళాశాల టాపర్స్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు బొమ్మల సాయిబాబాచారి ప్రిన్సిపల్‌కు శాలువా కప్పి పూలమాలలు వేసి అభినందించారు.

హైదరాబాద్‌లో కాంగ్రెస్‌దే విజయం



మహ్మద్ సమీర్ వలిఉల్లా ను సత్కరిస్తున్న తూమ్‌కుంట అరుణ్‌కుమార్, ఉస్మాన్ బిన్ హాజరి

అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్‌లో బీజేపీ, మజ్లిస్‌లను చిత్తుగా ఓడించి కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని హైదరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ సమీర్ వలిఉల్లా పేర్కొన్నారు. పాతబస్తీకి చెందిన కాంగ్రెస్ నాయకులు తూమ్‌కుంట అరుణ్‌కుమార్, ఉస్మాన్ బిన్ హాజరిలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సమీర్ వలిఉల్లా మాట్లాడుతూ.... మైనార్టీలతో పాటు అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారన్నారు.

సమ్మర్ ఆర్ట్ క్యాంపునకు స్పందన కరువు

బహదూర్‌పురా: నెహ్రూ జులాజికల్ పార్కులో నాల్గవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులో గురువారం ఎలాంటి పేర్లు నమోదు కాలేదు. 15 నుంచి 30 మందికి గ్రూప్‌గా ఈ శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ఏర్పాటు చేసిన విద్యార్థుల నుంచి స్పందన రాలేదు. 30వ తేదీ వరకు విద్యార్థి బృందాలకు ఈ వేసవి శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తిగల విద్యార్థులు రూ.1000 చెల్లించి సమ్మర్ ఆర్ట్ క్యాంపులో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

నివాళి



చార్మినార్: తెలంగాణ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తల్లి యాష్కి అనసూయ చిత్రపటం వద్ద టీపీసీసీ కార్యదర్శి కె.ఎస్.ఆనంద్‌రావు గురువారం నివాళులర్పించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

సుల్తాన్‌బజార్ : నిర్మాణంలో ఉన్న ఓ భవనంలోని మూడవ అంతస్తులో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సుల్తాన్‌బజార్ ఎస్ఐ.కిరణ్‌కుమార్ రెడ్డి గురువారం తెలిపిన మేరకు.. రామ్‌కోఠిలో ఓ భవనం నిర్మాణంలో ఉంది. భవనంలోని మూడో అంతసు నుంచి దుర్వాసన వస్తుండడంతో అక్కడ పని చేసే కార్మికులు సమాచారం అందించారు. దీంతో పోలీసులు బాత్‌రూమ్ తలుపులు విరగ్గొట్టి చూడగా సుమారు 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల ఓ వ్యక్తి గీజర్ పైపులకు ఉరివేసుకుని ఉన్నాడు. శరీరం కుళ్లిపోయిన స్థితిలో ఉంది. పోలీసులు వెంటనే మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.